క్లుప్తంగా

ఆరు కిలోల కణతి తొలగింపు

నారాయణపేట రూరల్: పట్టణ వైద్యులు అరుదైన ఆపరేషన్ చేసి మనిషి శరీరంలోని ఆరు కిలోల కణతిని తొలగించారు. వివరాల్లోకి వెళ్తే.. ఊట్కూర్ మండలం బిజ్వార్‌కు చెందిన 60 సంవత్సరాల వృద్ధురాలు జయమ్మ కడుపు నొప్పితో పట్టణంలోని గీతా ఆస్పత్రిలో చేరింది. డాక్టర్ విశ్వనాథ్ పరిశీలించి ఆమె కడుపులో ఉన్న కణతిని గుర్తించారు. శుక్రవారం అరుదైన ఆపరేషన్‌ను చేసి 6కిలోల కణతిని తొలగించారు. ఆపరేషన్‌లో డాక్టర్ గీత, స్పందన, భరద్వాజ్, తౌసిఫ్, కార్తీక్, వినోద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల వితరణ



మాగనూర్: మండల పరిధిలోని అడవిసత్యరంలో కీశే. మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి జ్ఞాపకార్థం వారి మనుమరాలు యశస్వి జన్మదినాన్ని పురస్కరించుకుని గ్రామంలోని పేద విద్యార్థులకు పాఠశాల బ్యాగులు వితరణ చేశారు. ఈ మేరకు.. కాంగ్రెస్ నాయకులు శివరాంరెడ్డి మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు తమవంతుగా సాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపడి ఎద్దు మృతి

నారాయణపేట రూరల్: మండలంలోని అమ్మిరెడ్డిపల్లి జీపీ పరిధిలోని బసిరెడ్డిపల్లిలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలుతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. ఈ సమయంలో పడ్డ పిడుగుపాటుకు ఓ ఎద్దు మృతిచెందింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్ల రాములుకు గ్రామశివారులో ఎప్పటిలాగే తన రెండు ఎద్దులను పొలం వద్దకు పాకలో కట్టి ఉంచాడు. ఆకస్మాత్తుగా ఈదురుగాలుతో కూడిన వర్షానికి పిడుగుపాటుకు గురై ఒక ఎద్దు అక్కడికక్కడే మృత్యువాత పడింది. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక

మద్దూరు: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం వెంకట్‌రాంరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికై న విద్యార్థులు 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రతి ఏడాది రూ.12 వేలు అందజేస్తారని తెలిపారు. పాఠశాలకు చెందిన అఖిల్, వరుణ్, విశాల్, బాలు, తేజస్విని, హరీష్‌కుమార్ ఎంపికైనట్లు తెలిపారు. వీరిని ఉపాధ్యాయులు రవి, సూర్యప్రకాష్, నర్సింహారెడ్డి అభినందించారు.

దామరగిద్ద: ప్రభుత్వం విద్యాశాల ద్వారా నిర్వహించి (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షల్లో మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో మొదటి, రెండో ర్యాంకులు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. ఎర్రనవీన్ మొదటి ర్యాంక్ సాధించగా, మెట్టు నవీన్ రెండో ర్యాంక్ సాధించారు. ఇదే పాఠశాలకు చెందిన అనూష, లింగమ్మ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం తిప్పన్న తెలిపారు. స్కాలర్‌షిప్ పొందెందుకు ఎంపిక కావడంపై విద్యార్థులను ఉపాధ్యాయులు శంభులింగం, మహేష్, విశ్వేరయ్య అభినందించారు. అలాగే మండలంలోని మల్‌రెడ్డిపల్లిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో ఆరుగురు విద్యార్థులు ప్రతిభను చాటి స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎల్లా స్వామి తెలిపారు.

ఊట్కూరు: మెరిట్ స్కాలర్‌షిప్‌కు మండలంలోని ఉన్నత బాలుర పాఠశాల విద్యార్థులు నలుగురు ఎంపికై నట్లు హెచ్‌ఎం సురేష్ తెలిపారు. ఎనిమిదోతరగతి చదువుతున్న మహేష్, బాలకృష్ణ, బీమేష్, పి. మహేష్ ఎంపికయ్యారని వీరికి ఏడాదికి రూ. 12వేలు స్కాలర్‌షిప్ ప్రభుత్వం ద్వారా అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

అగ్నివీర్‌లకు ఉచిత శిక్షణ



నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియం గ్రౌండ్‌లో నిరుద్యోగ యువతీ, యువకులకు వారియర్స్ డిఫెన్స్ అకాడమి ఉచితంగా అగ్నివీర్ ఎంపికకు శిక్షణ ఇస్తుందని డైరెక్టర్ ఆంజనేయులు తెలిపారు. 2024 ఏడాదికి గాను నోటిఫికేషన్ విడుదల కావడంతో జనవరి నుంచి ఉచితంగా మెటీరియల్ ఇవ్వడంతోపాటు థియరీ క్లాసులు నిర్వహించారు. శుక్రవారం నుంచి ఫిజికల్ టెస్టుల శిక్షణను ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నారు.

మొక్కల సంరక్షణ

అమరచింత: మండలంలోని ఆయా గ్రామాల్లో హరితహారం ద్వారా నాటిన మొక్కల సంరక్షణ కోసం ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. చెట్టుచెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పాంరెడ్డిపల్లెలో ఎంపీడీఓ మొక్కలకు నీటిని అందించారు.

రైతులపై పెట్టుబడుల భారం



మరికల్‌లో ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న ఓ రైతు (ఫైల్)

- ఏటేటా పెరుగుతున్న సాగు ఖర్చులు
- ట్రాక్టర్, నాగళ్ల కిరాయిల పెంపు
- కూలీల రేట్లు రెట్టింపు

మరికల్: వానాకాలం పంటల సాగుకు సిద్ధమవుతున్న రైతన్నలకు ఏటేటా పెరుగుతున్న పెట్టుబడులు భారంగా మారుతున్నాయి. సాగుభారం రైతన్నకు గుదిబండగా మారుతుంది. ట్రాక్టర్లు, యంత్రాలు, కూలీల, ఎరువులు ధరలు కూడా అమాంతంగా పెరగడంతో పెట్టుబడులు రైతుల నెత్తిన తడిసి మోపెడవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతు బంధు పథకం కింద ఎకరాకు పెట్టుబడి సాయం అందజేస్తున్న అదనంగా వస్తున్న ఖర్చులకే సరిపోతుంది. గతఏడాది కంటే ఎకరాకు ఈ ఏడాది సాగుకు రూ. 5వేల వరకు అదనపు భారం పడుతోంది. జిల్లాలో వర్షాధారంపై ఆధారపడి అత్యధికంగా రైతులు పత్తి పంటను సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 90వేల ఎకరాలకు పైగా పత్తిపంట సాగు అవుతుంది. కోయిల్‌సాగర్ ఆయాకట్టు కింద మాత్రమే ప్రతి ఏడాది 6 నుంచి 8వేల ఎకరాల వరకు వరి పంటను సాగు చేస్తారు. మిగితా మండలాల్లో పత్తితోపాటు, కంది, ఆముదం, జొన్న పంటలపై ఆధారపడుతున్నారు.

భారంగా మారుతున్న పెట్టుబడులు

పత్తిసాగు పెట్టుబడికి ఖర్చులు ప్రతి ఏడాది పెరుగుతున్నాయి. గత వానాకాలంలో పోలిస్తే ఈ సారి ఎకరాకు రూ. 5వేల వరకు అదనంగా ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. డీజిల్ ధరలు పైపైకి పోతుండడంతో దున్నకం ఖర్చులపై ప్రభావం పడింది. గత వానాకాలంలో ట్రాక్టర్ కిరాయి గంటకు రూ. 600 ఉంటే ఈ ఏడాది గంటకు రూ.800 తీసుకుంటున్నారు. వరినాటుసాగు విషయానికి వస్తే ప్రస్తుతం కరిగేట చేసే ట్రాక్టర్‌కు గంటకు రూ.1200 డిమాండ్ పలుకుతుంది. గతేడాది పత్తికి ఎకరాకు పెట్టుబడి రూ. 30వేలు వస్తే ఈ ఏడాది రూ. 35నుంచి 40వేల మధ్యన వచ్చే అవకాశం ఉంది. కూలీల కొరత ఏర్పడితే ఇతర గ్రామాల నుంచి వచ్చే కూలీలకు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

ఎరువుల ధరలు

రకం	పాత ధర	కొత్త ధర
డీఏపీ	రూ.1250	రూ.1600
20-20-0-13	రూ.950	రూ.1200
28-28-0	రూ.1275	రూ.1500
పొటాష్	రూ.850	రూ.1200
14-35-14	రూ.1275	రూ.1480
16-20-0-13	రూ.1000	రూ.1250

పెట్టుబడి ఖర్చులు ఇలా..

పనులు	గత వానాకాల	ప్రస్తుతం
కర్రిగేటకు (గంటకు)	రూ.1000	రూ.1200
గొర్రుకు	రూ.1500	రూ.2000
ఇతర పొలాలు దున్నట (గంటకు)	రూ.600	రూ.800
వరినాటు కూలీలకు (ఎకరాకు)	రూ.3500	రూ.4500
పత్తి ఎకరాకు	రూ.30,000	రూ.40,000

లాభాలు రావడం లేదు..



పంటల సాగు పెట్టుబడి పెరగడంతో రైతుల నెత్తిన అప్పుల భారం తడిసి మోపెడు అవుతుంది. దీంతో లాభాలు రావడం లేదు. గత వానాకాలంతో పోలిస్తే ఇప్పుడు ఎకరాకు రూ. 5వేల నుంచి 8వేల మధ్యన అదనపు భారం పడుతుంది. వ్యవసాయం చేసే కూలీల సంఖ్య తగ్గుతుంది. కానీ రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు లేక పెరిగిన పెట్టుబడులతో అప్పులు మీద పడుతున్నాయి.

- ఆంజనేయులు, రైతు, మరికల్

పంటలకు మద్దతు ధర ఇవ్వాలి..



పెట్టుబడులు పెరుగుతున్న కారణంగా ప్రభుత్వం కూడా రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఇచ్చి ఆదుకోవాలి. లేకుంటే నష్టాలను చవి చూడాల్సి ఉంటుంది. ఇంధనం ధరలు పెరగడంతో ట్రాక్టర్ కిరాయి పెంచారు. దీంతోపాటు కూలీల రేట్లు పెరగడం ఎకరా వెంబడి అదనపు ఖర్చులు మీద పడుతున్నాయి.

- వెంకటయ్య, రైతు, బూడ్యగాని తాండ

విత్తనాల కొనుగోలుపై అవగాహన కలిగి ఉండాలి



రైతులకు సూచనలు సలహాలు ఇస్తున్న ఏఈఓ



ముడుమాల్‌లో..

మాగనూర్: రైతులు ప్రతి విత్తనాలు కొనుగోలులో జాగ్రత్తలు వహించాలని ఏఈఓ రాధిక అన్నారు. శుక్రవారం పర్మన్‌దొడ్డిలో అచ్చంపేటలో రైతులకు విత్తనాల కొనుగోలు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వేసవి దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు విత్తనాలు విత్తేందుకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో ఇదే అదునుగా చేసుకుని కొందరు దళారులు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించి వారిని మోసం చేస్తుంటారని అటువంటి వారిపై రైతులు జాగ్రత్త పాటించి కేవలం గుర్తింపు పొందిన షాపులలో విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. అనంతరం నూతన వరి వంగడాలు, కరొండా-జీవ కంచె ఉపయోగాలపై వివరించారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: ప్రస్తుతం పంటల విషయంపై రైతులకు అవగాహన కల్పిస్తునట్లు ఏఈఓ సుదర్శన్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ముడుమాల్, తంగిడి గ్రామాల్లో ఏఈఓ మహేష్, మానస రైతులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి వారికి పలు విషయాలపై వివరించారు. అదేవిధంగా ప్రభుత్వం అందిస్తున్న రైతు బీమా, పీఎం కిసాన్ వంటి సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



నారాయణపేట: మండలంలోని కోటకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన కే. శివ పదో తరగతిలో 9.8 జీపీఏ సాధించి ఆ పాఠశాల టాపర్‌గా నిలవడంతో శుక్రవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థి శివ పదోతరగతి ఫలితాల్లో మంచి జీపీఏ సాధించడం గర్వ కారణమని కలెక్టర్ పేర్కొన్నారు. భవిష్యత్‌లోనూ ఇదే పట్టుదలతో చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని విద్యార్థికి సూచించారు. విద్యార్థి శివతోపాటు తండ్రి సుధాకర్ ఉన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రి ప్రారంభం



నారాయణపేట రూరల్: పట్టణంలోని యాద్గీర్ రోడ్డులో ఏర్పాటుచేసిన నూతన ప్రైవేట్ ఆస్పత్రి భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ప్రారంభించారు. పాతగంజ్ ఏరియాలో అద్దె భవనంలో నడుస్తున్న పీఎస్ సునంద మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి అతి తక్కువ కాలంలోనే సొంత భవనంలోకి మారింది. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైద్యం కోసం వచ్చే రోగులకు నాణ్యమైన సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్రం గుర్మిట్కల్ ఎమ్మెల్యే శరణగౌడ, మున్సిపల్ చైర్‌పర్సన్ గందెఅనసూయ, కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు, ఆస్పత్రి ఎండీ ప్రసాద్‌శెట్టి, డైరెక్టర్ దీపిక పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి జయంతి



ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని పరిమళాపురం వీధిలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి జయంతి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు నర్సింహాస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి పంచమృతాభిషేకం, అర్చన, పుష్పాలంకరణ, హారతి తదితర పూజలు కొనసాగాయి. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తితో కనుల పండువగా పల్లకిసేవ, చక్రస్నానం చేశారు. ప్రముఖ జ్యోతిష్య పండితులు విద్వాన్ అనిల్‌జ్యోషి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భీంసేన్‌రావు, శ్రీధర్‌రావు, అనిరుద్, ప్రహ్లాద్, మంజునాథ్,సీతారామారావు పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మ ఉత్సవాలు



బోనాలతో ప్రదక్షణలు చేస్తున్న భక్తులు

మద్దూరు: మండల కేంద్రంలోని ఎండ్ల బజారులోని మైసమ్మ ఉత్సవాలు శుక్రవారం ఎంపీటీసీ వెంకటయ్య ఆధ్వర్యంలో వైభవంగా కొనసాగాయి. ఉదయం పోచమ్మ ఆలయం నుంచి మేళతాళాల మధ్య జల్ది ఊరేగింపు పాతబస్టాండ్ మీదుగా ఆలయం వరకు కొనసాగింది. అనంతరం పూజారి రాఘవేంద్రచారి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, ఇతర పూజ కార్యక్రమాలు కొనసాగాయి. సాయంత్రం మహిళలు డప్పుల చప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే నిడ్జింతలో పోచమ్మకు బోనాలెత్తి మహిళలు తమ మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు ముష్టి నర్సింహులు, తిరమలప్ప, నర్సింహులు, మల్లప్ప, కృష్ణయ్య, చెన్నప్ప, ఆనంద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీ

దామరగిద్ద: ప్రభుత్వం తెలంగాణ సీడ్ కార్పొరేషన్ ద్వారా ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను సరఫరా చేసిన జీలుగ విత్తనాలను రైతులకు అందజేస్తున్నారు. 30 కేజీల బస్తా రూ. 1116 లకు అందజేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్ తెలిపారు. రెండు రోజులగా ఆగ్రోస్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని అవసరమైన రైతులు తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అజయ్ కుమార్, రైతులు, డీలర్‌లు పాల్గొన్నారు.

అంజన్న రథోత్సవం



మరికల్: మండలంలోని పెద్దచింత కుంటలో ఈశ్వర ఆంజనేయస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున భక్తులు స్వామివారి రథోత్సవాన్ని కనుల పండవగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో అఖండ భజన కార్యక్రమాలతోపాటు అడుగల భజన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తుల మధ్యన స్వామివారి రథోత్సవాన్ని గ్రామపుర వీధుల గుండా సాగింది.

శిథిలావస్థకు చేరిన పాఠశాల కూల్చివేత

మరికల్: మండల కేంద్రంలోని శిథిలావస్థకు చేరిన జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలను శుక్రవారం కలెక్టర్ ఆదేశాలతో అధికారులు కూల్చివేయించారు. 70ఏళ్ల పాటు ఎంతోమంది విద్యార్థులకు విద్యను అందించిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉండటంతో ముందస్తుగా విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరకముందే కూల్చివేత చర్యలు చేపట్టారు. మనఊరు -మన బడి కింద పాతభవనం ఎదుట కొత్త భవనం నిర్మించారు. ఆ భవనాన్ని ప్రారంభించాల్సి ఉంది.



కనులపండువగా నర్సింహస్వామి రథోత్సవం

- రథోత్సవంలో పాల్గొన్న వేలాది మందిభక్తులు
- స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



పాల ఉట్ల స్తంభం ఎక్కుతున్న యువకులు

మాగనూర్: మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం కనుల పండువగా కొనసాగింది. ఇందులో భాగంగా తెల్లవారుజామున రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకిలో బాజాభజంత్రీల మధ్య స్వామివారి విగ్రహం ముందుకు కదిలింది. మహారాష్ట్ర, కర్ణాటక, హైదారబాద్ లాంటి ప్రాంతాల నుంచి వేలాదిగా స్వామివారి దర్శనంకోసం భక్తులు తరలివచ్చారు. పలు పార్టీల నాయకులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రథోత్సవంలో ఎమ్మెల్యే వాకిటి..

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొని రథానికి ప్రత్యేక పూజలుచేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే స్వామివారి రథాన్ని ముందుకు లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు.

పాల ఉట్ల ఉత్సవం..

సాయంత్రం పాల ఉట్ల ఉత్సవాన్ని నిర్వహించారు. 25మందికి పైగా యువకులు పాల ఉట్ల స్తంభాన్ని ఎక్కేందుకు పోటీ పడ్డారు. అయితే ఈ సారి గ్రామ పెద్దలు ముందుగా కొంతసేపు చిన్నారులను పాల ఉట్లు ఎక్కించారు. ఇది భక్తులను ఎంతగానో ఆక్కటుకుంది. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రాజు, జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీపీ శ్యామలమ్మ, మాజీ ఉపసర్పంచ్ సుధా, ఆలయ కమిటీ సభ్యులు వాకిటి వాబయ్య, బలరాజు, నరేష్, వాకిటి శ్రీనివాసులు, కృష్ణయ్య, సత్యప్ప, ఆనంద్, గ్రామ పెద్దలు, ఆనంద్‌గౌడ్, వెంకటయ్య, చెన్నప్ప, ఉజ్జేల్లి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నకిలీ విత్తనాలు అమ్మితే కేసులు నమోదు



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ, ఏఓ

కోస్గి: ఎవరైనా వ్యాపారులు నకిలీ విత్తనాలు గాని, కల్తీ ఎరువులు, మందులు అమ్మిన వ్యాపార లైసెన్స్‌లు రద్దు చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామని ఏడీఏ నగేష్ ఏఓ రామకృష్ణ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో నిల్వ ఉన్న స్టాక్ రిజిస్టర్‌లో నమోదైన వివరాలు పరిశీలించారు. రైతులు సరుకులు కొనుగోలు చేసిన సమయంలో విధిగా రసీదులు తీసుకోవాలని, ప్యాకింగ్ లేని విత్తనాలు కొనుగోలు చేయొద్దని ఏడీఏ ఈ సందర్భంగా సూచించారు. ఈ తనిఖీల్లో ఎలాంటి నకిలీ విత్తనాలు పట్టుబడలేదన్నారు. అనంతరం మండల పరిధిలోని కడంపల్లిలో నకిలీ పత్తి విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పంటకు బలం.. రైతుకు లాభం

- పచ్చిరొట్ట సాగుకు సమయమిదే..

కొత్తకోట రూరల్: తొలకరి వర్షాలు పడే సమయంలో భూమిని ఖాళీగా ఉంచకుండా పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని, సాగుకు అనువైన సమయం ఇదేనని మండల వ్యవసాయ అధికారి షేక్‌మున్నా తెలిపారు. భూసారాన్ని పెంచుకుంటూ అధిక దిగుబడులకు పచ్చిరొట్ట ఎంతగానో దోహదపడుతుందన్నారు. సేంద్రియ ఎరువులతోనే పంట దిగుబడిని రెట్టింపు చేసుకోవచ్చనని తెలిపారు. ప్రధానంగా జీలుగ పచ్చిరొట్ట విత్తనాలను ఈ సీజన్‌లో తప్పనిసరిగా పొలాల్లో చల్లినట్టయితే రసాయన ఎరువులతో అంతగా పని ఉండదన్నారు.

పచ్చిరొట్టతో ఉపయోగాలు..

- జీలుగా విత్తనాలు చల్లుకోవడం ద్వారా నేల కోతకు గురికాదు.
- పచ్చిరొట్ట పైరు పొలంలో కలుపు మొక్కల పెరుగుదలను పూర్తి కంట్రోల్ చేస్తుంది.
- పచ్చిరొట్ట పూతదశలో ఉండగా లేదా విత్తనాలు వేసిన 50రోజుల తర్వాత పొలాన్ని కలియదున్నాలి.
- ఆ విధంగా దున్నడం వల్ల నేలకు సేంద్రియ పదార్థం సమకూరుతుంది. అలాగే నేల గుల్లబారుతుంది. తద్వారా మొక్కల వేళ్లు బాగా పెరిగి పోషకులు బాగా గ్రహిస్తాయి. నేలల్లో చౌడు తగ్గుతుంది.
- నేలకు మేలు చేసే సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి.
- జీలుగ పైర్ల వేళ్లపై ఉండే బొడిపెలు గాలిలో నత్రజనిని స్వీకరిస్తాయి.
- కుళ్లిన రొట్ట ద్వారా భూమికి నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి ఎరువులు ఆ తర్వాత వేసే పంటలకు లభిస్తాయి.
- సూక్ష్మపోషకాలు అయినా ఇనుము, జింక్, మెగ్నీషియం,కాల్షియం వంటివిభూమినుంచి లభిస్తాయి.
- పచ్చిరొట్ట పైర్ల వల్ల ఎకరాకు 7కిలోల నత్రజని 1.2కిలోల భాస్వరం, 5కిలోల పొటాష్ వంటి ఎరువులు పంటకు లభిస్తాయి. తద్వారా ఎరువుల వాడకం సగానికి సగం తగ్గి దిగుబడి పెరుగుతుంది.
- పచ్చిరొట్ట పైరును భూమిలో కలియదున్నిన 15రోజుల తర్వాత పొలంలో నాట్లు వేయవచ్చు.



కొత్తకోట మండలం పొలెంలో సాగవుతున్న పచ్చిరొట్ట

కార్మికుల ఉపాధి కోసం ఉద్యమాలకు సిద్ధం



మాట్లాడుతున్న వెంకటేష్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కార్మికుల ఉపాధి కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని రైస్, ఆయిల్ మిల్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో రైస్, ఆయిల్ మిల్లులలో పనిచేస్తున్న దినసరి మహిళా కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా కూలీలు రోజువారీగా బట్టీపైన వందలాది బస్తాలు గుమ్మరిస్తున్న క్రమంలో వచ్చే దుమ్ముతో టీబీ, గర్భసంచి వ్యాధుల లాంటి దీర్ఘకాలిక రోగాలకు గురవుతున్నారని వాపోయారు. వీరికి ఉపాధి భద్రతతో కూడిన సమగ్ర చట్టం రూపొందించాలని, వృద్ధాప్య ఫించన్ రూ.ఆరు వేలకు తగ్గకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరణించిన బాధిత కుటుంబాలకు రూ.పది లక్షల బీమా కల్పించాలన్నారు. రైస్, ఆయిల్ మిల్లులు ప్రధానంగా వ్యవసాయ రంగంపై ఆధారపడ్డాయన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు.

కుదిరిన వేతన ఒప్పందం

అనంతరం కూలీలకు దినసరి వేతనం రూ.490 నుంచి రూ.580కి పెంచడానికి, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించేందుకు రైస్, ఆయిల్ మిల్లుల యజమానుల ప్రతినిధులు, ఇఫ్టూ కార్మికసంఘ ప్రతినిధుల మధ్య ఒప్పందం కుదిరింది. ఇది ఈనెల 1 నుంచి అమలవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు పి.దాసు నాయకులు ఎం.నర్సింహులు, పి.చెన్నయ్య, నాయకురాళ్లు చంద్రమ్మ, సరోజ, మణెమ్మ, నాజీయా బేగం, చంద్రకళ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మధ్యప్రదేశ్‌లో భక్తిమళ్ల వాసి దుర్మరణం



వెంకటయ్య (ఫైల్)

కోస్గి: గుండుమాల్ మండలం భక్తిమళ్లకు చెందిన ఓ వ్యక్తి గ్రామస్తులతో కలిసి కాశీ యాత్రకు వెళ్లి మధ్యప్రదేశ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గ్రామస్తులు, బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వెంకటయ్య (59) మరో 8 మందితో కలిసి గతవారం కాశీ యాత్రకు వెళ్లాడు. కాశీ, అయోధ్య తదితర క్షేత్రాలను దర్శించుకొని స్వగ్రామానికి బయలుదేరారు. గురువారం తెల్లవారుజామున సుమారు 5.30 ప్రాంతంలో మధ్యప్రదేశ్‌లోని రీటా జిల్లాలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం రాత్రి స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. వెంకటయ్యకు భార్య కొండమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.